శరవేగంగా బైపాస్ పనులు

- అంతిమ దశకు చేరుకున్న పిడుగురాళ్ల బైపాస్
- ఇప్పటికే పిల్లుట్ల రోడ్డు నుంచి వాహనాల మలుపు
- క్లియర్ కానున్న పిడుగురాళ్ల పట్టణ ట్రాఫిక్ సమస్య



పూర్తి అయిన బైపాస్ రోడ్డు



రైల్వే బ్రిడ్జి వద్ద ముమ్మరంగా చేస్తున్న పనులు చేస్తున్న కార్మికులు



రైల్వే బ్రిడ్జి వద్ద ముమ్మరంగా చేస్తున్న పనులు

పిడుగురాళ్ల: బైపాస్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పిడుగురాళ్ల పట్టణానికి ఏళ్ల తరబడి ఉన్న ట్రాఫిక్ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి కాంట్రాక్టర్ల ద్వారా బైపాస్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుని ఒక్క రైల్వే బ్రిడ్జి వద్ద గటర్ల ఏర్పాటు తప్పా బైపాస్ మొత్తం పూర్తి అయి అంతిమదశకు చేరుకుంది. ఈ బైపాస్ పూర్తి అయితే పిడుగురాళ్ల పట్టణానికి పట్టిన ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది.

ఇప్పటికే ట్రాఫిక్ మళ్లింపు....

పట్టణంలోని ఖలీల్ దాబా వద్ద నుంచి పిల్లుట్ల రోడ్డు మీదుగా పోలీస్ స్టేషన్ చేరుకుని అక్కడి నుంచి గుంటూరు, నర్సరావుపేట వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా గుంటూరు, నర్సరావుపేట నుంచి వచ్చే వాహనాలు పోలీస్ స్టేషన్, పిల్లుట్ల మీదుగా ఖలీల్ వద్దకు వచ్చే విధంగా పోలీసులు, హైవే సంస్థ నిరంతరం కృషి చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ట్రాఫిక్‌తో ఇబ్బంది పడే ఐలాండ్ సెంటర్ ఇప్పుడు ట్రాఫిక్ సమస్య లేకుండా నిరంతరం వాహనాలు వెళ్తూ..పోతూ కనిపిస్తోంది.

6 కిలో మీటర్ల మొత్తం పూర్తి...

పిడుగురాళ్ల పట్టణంలోని ఖలీల్ దాబా వద్ద నుంచి కొండ మోడు వరకు ఏళ్ల తరబడి నిర్మించాల్సిన బైపాస్ రోడ్డు నిర్మాణం కాక ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శరవేగంగా పనులు ప్రారంభించే విధంగా హైవే సంస్థలతో మాట్లాడి పనులను ప్రారంభించారు. 6 కిలో మీటర్లు పూర్తి అయింది. కొండమోడు వద్ద జంక్షన్, ఖలీల్ వద్ద ఒక జంక్షన్ ఏర్పాటు చేసి వాటి వద్ద మహానేతల విగ్రహాలను ఏర్పాటు చేసి పిడుగురాళ్ల పట్టణ రూపు రేఖలు మార్చబోతున్నారు. ఇప్పటికే పట్టణంలో విగ్రహాలు ఏర్పాటు చేయించి అన్ని వర్గాల మన్ననలను పొందారు.

ఇక గటర్లదే లేట్...

బైపాస్ రోడ్డు అంతా పూర్తి అయింది. ఇక గటర్లు వస్తే వాటిని రైల్వే బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసి ఆ రైల్వే బ్రిడ్జిపై నుంచి వాహనాలు వెళ్లే విధంగా చేస్తే ఖలీల్ వద్ద నుంచి కొండమోడు వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వాహనాలు వెళ్లేవిధంగా హైవే సంస్థ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక గటర్లు వస్తే వాహనాలు రాకపోకలు సాగుతాయి.

బైపాస్ పనులు పూర్తి చేసి వాహనాలు మళ్లిస్తాం



గతంలో ఇచ్చిన హామీ మేరకు బైపాస్ రోడ్డుపై ప్రతిపక్ష నాయకుల వాహనాలు కూడా వెళ్లే విధంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో బైపాస్ రోడ్డు పూర్తైతే పిడుగురాళ్ల పట్టణంలో ఏళ్ల తరబడి ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించబోతున్నాం.

– కొత్త వెంకట సుబ్బారావు,
మున్సిపల్ చైర్మన్ పిడుగురాళ్ల

ట్రాఫిక్ సమస్య వల్ల ఎన్నో ప్రమాదాలు..



పిడుగురాళ్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో నిరంతరం భారీ వాహనాలు వస్తూ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా పెద్ద వాహనాల రాక వల్ల ట్రాఫిక్ ఎక్కువగా ఉండి ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.

– ఇల్లూరి వెంకయ్య,
పిడుగురాళ్ల వాసీ

పిడుగురాళ్లలో వర్షం



పిడుగురాళ్ల పట్టణంలోని మెయిన్ రోడ్డులో నిలిచిపోయిన నీరు



కారంపూడిలో రోడ్డుపైన నిలిచిన మురుగునీరు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో వర్షం పడింది. గత వారం రోజుల నుంచి వర్షాలు లేక రైతులు, ప్రజలు ఎండ తీవ్రత తట్టుకోలేక అల్లాడిపోయారు. దీంతో శనివారం వర్షం పడడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్య క్తం చేశారు. రైతులు ఇప్పటికే పొలాలను చదును చేసి విత్తనం విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ వర్షం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు

కారెంపూడి: కారెంపూడిలో శనివారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికే స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ కాంప్లెక్స్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు జలమయం అయింది. రోడ్డుపైనే నీరు పారింది. ఇటీవల ఇక్కడ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు దిగువన డ్రైనేజీ వాటర్ పోయేందుకు రెండు పైపులు వేశారు. అయితే పూర్తిస్థాయిలో రిపేర్లు పూర్తి కాకపోవడంతో పాటు డ్రైనేజీ పైపులు వ్యర్థాలతో పూడిపోవడంతో నీరు పోయే మార్గం లేక నీరు రోడ్డుపైనే ప్రవహించింది. అలాగే అంకాళమ్మ గుడి వీధిలో కూడా డ్రైనేజీ కాల్వలు చిన్నవిగా ఉండి అవి పూడిపోవడంతో ఈ సమస్య తలెత్తి ఆ వీధిలో కూడా ఇదే పరిస్థితి తలెత్తింది. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో ఉపశమనం

గురజాల : నియోజకవర్గంలోని గ్రామాల్లో గత వారం రోజులుగా ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. సుర్రుమంటున్న సూర్యుడితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండ తీవ్రత భరించలేని ఉక్కపోతతో అల్లాడిపోయారు. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడింది. రోడ్లంతా జలమయంగా మారాయి. ఉక్కపోత నుంచి కాస్త ప్రజలకు ఉపశమనం లభించింది.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతిచెందిన గాడిపర్తి వెంకట్రావు

దుర్గి: మండల పరిధిలోని శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన వివరాల మేరకు ఆలయం ప్రాంతంలో గాడిపర్తి వెంకట్రావు(45) అద్దె గదులు, వాటర్ ప్లాంట్ వ్యాపారం నిర్వస్తుంటాడు. వాటర్ ప్లాంట్ స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుని స్వగ్రామమైన అడిగొప్పలలో కొన్నాళ్ళుగా వ్యాపారం చేసుకుంటూ అందరితో కలిసిమెలసి ఆప్యాయంగా అందరిని పలకరిస్తున్న వ్యక్తి మృతి చెందడంతో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీటి పర్యాంతమయ్యారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు మెట్టు రామకృష్ణారెడ్డి (ఆర్కే), జక్కా రమేష్, రణధీర్‌రెడ్డి తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి గాడిపర్తి వెంకట్రావు మృతదేహనికి నివాళులర్పించారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటికీ ఓటరు సర్వేను వేగవంతం చేయాలి

బీఎల్వోలను ఆదేశించిన ఆర్డీవో యం.శేషిరెడ్డి

రొంపిచర్ల: ఇంటింటికీ ఓటరు సర్వేను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీవో యం.శేషిరెడ్డి బీఎల్వోలను ఆదేశించారు. మండలంలోని పరగటిచర్ల, నల్లగార్లపాడు గ్రామాల్లో శనివారం ఆయన సర్వేను ఎమ్మార్వో అంకారావుతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో కొత్తగా నమోదైన ఓట్లు, చనిపోయిన ఓటర్ల తొలగింపు, జాబితాలో మార్పులు, చేర్పులతో పాటు ఇప్పటి వరకు అందిన దరఖాస్తు వివరాల్ని బీఎల్వోల ద్వారా తెలుసుకున్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు నమోదైతే పంచాయతీ అధికారులతో కలసి ఆయా ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇంటింటికీ చేపట్టిన ఓటర్ల సర్వేపై బీల్వోలకు ఓటర్లు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మార్వో అంకారావు మాచవరం, విప్పర్లరెడ్డిపాలెం, సంతగుడిపాడు, రొంపిచర్ల, తుంగపాడు, అన్నవరం గ్రామాల్లో సర్వేను కార్యక్రమాన్ని పర్యవేక్షించి, బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ నిషేధం, నీటిని జాగ్రత్తగా వాడటం తదితర అంశాలపై ప్లకార్డులు చేతబూని కరపత్రాల్ని పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సామూహిక గ్రూపు చర్చలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అరుంధతి కాలనీ, హనుమాన్‌నగర్, డ్రైవర్స్ కాలనీ, మసీదు మాన్యం కాలనీల్లో పర్యావరణ పరిరక్షణపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యోగి, అధ్యాపకులు, సంస్థ సిబ్బంది విద్యారావ్, ఆశ, సంధ్య, షాహీదా, కొండలు పాల్గొన్నారు.

ఆనంద జీవనానికి యోగా



శిబిరం ముగింపు సమావేశంలో పాల్గొన్న అభ్యాసకులు

నరసరావుపేట ఈస్ట్: ఆనంద జీవనానికి యోగా దోహదపడుతుందని శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకుడు వేంకటేశ్వర గురూజీ తెలిపారు. యోగా సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 28రోజుల పాటు నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరం ముగింపు సమావేశాన్ని శనివారం శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించారు. అభ్యాసకుల్ని ఉద్దేశించి వేంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ అభ్యాసకులు శిబిరంలో పొందిన యోగ శిక్షణను నిత్యం కొనసాగించడం ద్వారా పంచసిద్ధి లభిస్తుందని తెలిపారు. మానసిక, శారీరక రుగ్మతలు తొలగి జీవితాంతం ఆనందంగా జీవించవచ్చని వివరించారు. కార్యక్రమంలో శిబిరం యోగా గురూజీ కూనిశెట్టి వెంకట జనార్దన్, చిలకలూరిపేట శాఖ గురూజీ కాపుగంటి శివప్రసాద్, కన్వీనర్ అనూరాధ, సహాయ బోధకులు జల్లి శ్రీనివాసరావు, కోట మల్లేశ్వరి పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలకు స్పందన

రొంపిచర్ల: 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భగత్‌సింగ్ భవన్ ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు శనివారం 'రాజ్యాంగ విలువలు- నేటి పరిస్థితి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.2 వేలు, రూ.1000, రూ.500తో పాటు నాలుగు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గోగులపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థిని జి. రామతులసి మొదటి బహుమతి, వి.రెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన సీహెచ్. భార్గవి, ఎం. భార్గవ్ ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారని చెప్పారు. విజేతలకు ఆగస్టు 15న పాఠశాలలకు వెళ్లి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్. రామకృష్ణంరాజు, శేషంరాజు, మస్తాన్‌వలి, శివరాం, వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



ముప్పాళ్ళలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ అరుణ

ముప్పాళ్ళ: రైతులు తప్పనిసరిగా సాగు పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. అన్ని గ్రామాల్లోను ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు ప్రభుత్వం అందించే బీమా సాయం అందుతుందన్నారు. కౌలు సాగు చేసే రైతులు కార్డు ఉంటే ఈ-క్రాప్ నమోదు చేసుకోవచ్చన్నారు. పంట నమోదు చేయించుకున్న వారు ఏ పంట అయితే నమోదు చేసుకున్నారో వారికి సున్న వడ్డీ రాయితీ లభిస్తోందని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని ఉండాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏ పావని, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాదారులకు న్యాయం చేయాలి

సీపీఎం పల్నాడు జిల్లా సభ్యుడు రవిబాబు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో గల దొడ్లేరు చైతన్య గోదావరి బ్యాంకులో జరిగిన తనఖా బంగారం వస్తువుల గోల్‌మాల్ పై సమగ్ర విచారణ జరిపి ఖాతాదారులకు న్యాయం చేయాలని సీపీఎం శనివారం డిమాండ్ చేసింది. ఈమేరకు దొడ్లేరు బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం పల్నాడు జిల్లా వర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ బ్యాంకులో తనిఖీకి వచ్చిన అధికారులతో ఈ విషయమై చర్చించినట్లు చెప్పారు. బ్యాంకులో బంగారం అప్రైజర్‌గా పనిచేసిన నాగార్జున పథకం ప్రకారం ప్రతి గ్రామానికి కొంత మంది బినామీలను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా లావాదేవీలు నడిచేటట్లుగా ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు తెలిజేశారన్నారు. అదేవిధంగా తాకట్టు పెట్టుకున్న ఖాతాదారులు రెన్యువల్ చేసుకున్న సమయంలో అసలు రశీదులు ఇవ్వడం జరగలేదని, ఇచ్చినా ఆభరణాల వివరాలు రాయకుండా ఇచ్చినట్లు గుర్తించడం జరిగినట్లు చెప్పారని తెలిపారు. బ్యాంకు మేనేజరు, కిందస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్రైజర్ నాగార్జున బంగారం వస్తువుల్లో అవకతవకలకు పాల్పడి తన బినామీల పేర్లతో బ్యాంకులోనే తనఖా పెట్టినట్లు అధికారులు చెప్పినట్లు తెలిపారు. ఖాతాదారులు తమ బంగారం వస్తువులు ఉన్నాయా లేవా తెలుసుకునేందుకు వచ్చే నెల 3 వ తేదీ వరకు తనిఖీ అధికారులు స్లిప్పులు ఇచ్చినట్లు తెలిపారు. అప్పటి వరకు ఖాతాదారులు తమ వస్తువులు ఏమయ్యాయో నని తీవ్ర మానసిక ఆందోళన చెందే పరిస్థితి నెలకొందని అన్నారు. కావున బ్యాంకు తనిఖీ అధికారులు ఖాతాదారులతో సమావేశం నిర్వహించి వారికి పూర్తి భరోసా కల్పించాలన్నారు. ప్రతి ఖాతాదారుడికి ఒక గ్రాము బంగారం కూడా నష్టం జరగకుండా బ్యాంకు అధికారులు పూర్తి భరోసా కలిస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి తిమ్మిసెట్టి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో 4.2 ఎం.ఎం. వర్షపాతం నమోదు

రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం ఉదయానికి 4.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి, మర్రిచెట్టుపాలెం, దాసరిపాలెం, మాచవరం గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

నేడు మాచవరం, సుబ్బయ్యపాలెంలో ఎమ్మెల్యే పర్యటన

రొంపిచర్ల: మండలంలోని మాచవరం, సుబ్బయ్య పాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటిస్తారని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు మాచవరం కాలనీలో నూతనంగా నిర్మించనున్న చర్చి శంకుస్థాపనలో, సాయంత్రం 5 గంటలకు సుబ్బయ్యపాలెంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

రెండు వార్డులు వైఎస్సార్ సీపీ కైవశం

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట, మల్లవరం గ్రామాల్లోని రెండు వార్డులకు నిర్వహిస్తున్న ఉప ఎన్నికలకు సంబంధించి ఒక్కొక్క నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల అధికారులు ఈఓపీ ఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి శనివారం తెలిపారు. తుమ్మకోట గ్రామంలో 14వ వార్డుకు దేవనబోయిన రామయ్య, మల్లవరం గ్రామంలో 5వ వార్డుకు గువ్వల శ్రీదేవి నామినేషన్ వేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఈ నెల 14వ తేదీన వారికి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నిక ధృవీకరణ పత్రాన్ని అందచేయనున్నట్లు వారు తెలిపారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులుగా దేవనబోయిన రామయ్య, గువ్వల శ్రీదేవి నామినేషన్‌లు వేశారు.

వైఎస్సార్ సీపీతోనే న్యాయం

మాచర్ల: నియోజక వర్గంలో మాదిగలను గుర్తించి గౌరవించిన కుటుంబం పిన్నెల్లి కుటుంబమని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. శనివారం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లు, నాయకులుతో కలిసి మున్సిపల్ కౌన్సిల్ హాలులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రతి మాదిగ కుటుంబం వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పీఆర్కేలను గెలిపించుకునే బాధ్యతను తీసుకోవాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మందా సంతోష్, ఎస్సీ విభాగ కౌన్సిలర్లు వేల్పుల విజయమేరి, కలివెల జ్యోతి, గెల్లెపోగు జగన్నాధం, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగ నాయకుడు బొంగురు, కలివెల రాజు తదితరులున్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసి ప్రత్యేక బస్సుల ఏర్పాటు

మాచర్ల: నియోజక వర్గ పరిధిలోని భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసి మాచర్ల బస్సు డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్టీసి డీఎం పిచ్చయ్య తెలిపారు. శనివారం ఆర్టీసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రత్యేక బస్సుల వివరాలు వెల్లడించారు. ఈ నెల 29 నుంచి రాత్రి 7గం॥లకు అరుణాచలానికి బస్సు బయలుదేరుతుందన్నారు. 30న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శనం, 31న అరుణాచలేశ్వరుని దర్శనం కోసం సాయంత్రం తిరుగు ప్రయాణమౌతుందన్నారు. తిరిగి సెప్టెంబర్ 1న ఉదయం 7గంటలకు మాచర్లకు బస్సు చేరుతుందన్నారు. ఒక్కొక్కరికీ రానుపోను టిక్కెట్ ధర రూ. 2750 మాత్రమేనన్నారు. గతంలో రూ. 3150 ఉన్న టిక్కెట్ ధరను తగ్గించడం జరిగిందని ఆర్టీసి డీఎం పిచ్చయ్య అన్నారు. కావున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు : 9959225432, 7382801048, 7382895100లను సంప్రదించాలన్నారు.

నేరాల నియంత్రణకు సమగ్ర చర్యలు: డీఎస్పీ

నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల పోలీస్ స్టేషన్‌ను నరసరావుపేట డీఎస్పీ కె.వి.మహేష్ శనివారం సందర్శించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ వై. అచ్చయ్య, ఎస్ఐ జె. బలరామిరెడ్డి, సిబ్బందితో సమావేశమయ్యారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, దర్యాప్తు తీరును ఆరా తీశారు. నేరాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గుంటూరు–కర్నూలు రాష్ట్రీయ రహదారి, కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. దొంగతనాల నియంత్రణకు ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల్ని స్థానిక నాయకుల సహకారంతో ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల తనిఖీ, పాన్‌పరాగ్, గంజాయి తదితర మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ఠ నిఘా ఉంచాలని ఆదేశించారు.

ఓటర్ల జాబితా సర్వే వేగవంతం చేయాలి



శావల్యాపురం: ఓటర్ల జాబితా సర్వే వేగవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు బీఎల్‌వోలకు సూచించారు. మండలంలోని కనమర్లపూడి, గంటావారిపాలెం గ్రామాల్లో శనివారం ఆయన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 21 వరకు ఓటర్ల జాబితా పరిశీలన సమర్థంగా చేపట్టాలని చెప్పారు. ప్రతిరోజూ బీఎల్‌వోలు 25 నుంచి 30 ఇళ్లను సర్వే చేయాలని, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు కూడా సహకారాన్ని అందించాలని కోరారు. ఆయనతో పాటు ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వో ఉప్పుటూరి చిన మంగయ్య ఉన్నారు.

దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తు

గురజాల : దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు ఆశలతా ఒక ప్రకటనలో తెలిపారు. 2023–2024 సంవత్సరానికి గాను ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి చేరే వారు 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్‌లో చేరే వారు 15 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం: 93987 10992 సంప్రదించాలన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మార్కొండారెడ్డి

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే రైతన్నల సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుల వద్దకే సంక్షేమ పథకాలు అందించే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కుర్రి సాయి మార్కొండారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని జమ్మలమడక గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతన్నల శ్రేయస్సు కోసం ఆర్‌బికెలను ఏర్పాటు చేసి వారికి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సబ్సిడీ పై అందించటమేకాకుండా వ్యవసాయాధికారులను నియమించి వారి ద్వారా రైతులకు విలువైన సలహాలను అందిస్తున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలు ప్రతి ఆర్‌బికెలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్‌బికె ఉద్యోగులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి తగు జవాబుతనంగా వ్యవహరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పారెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ పరిమళ ఏసోబు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

150 మందికి బ్లడ్ గ్రూపుల పరీక్షలు



మాచర్ల: త్వరలో జరిగే స్వాతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణ సేవా సమితి, మాచర్ల వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత బ్లడ్‌గ్రూపులు నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరైన కమిషనర్ ఈవి రమణబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 150 మందికి ఉచిత బ్లడ్ గ్రూపుల గురించి సమాచారం తెలిపారు. రాబోయే రోజుల్లో యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సెక్రెటరీ పోలిశెట్టి పుల్లారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పవరపు గాంధీ, షేక్ లాలుసాహెబ్, ముత్యాల పాపిరెడ్డి, ఒరుగంటి చెన్నకేశవరావు, బొగ్గవరపు సత్యనారాయణ, మణి ల్యాబ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

మాచర్ల: స్వాతంత్ర్య వసంత వేడుకల్లో భాగంగా ఈ నెల 15న గౌతమ్ స్కూల్‌లో నిర్వహించే వేడుకల్లో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవి రమణబాబు, తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, ఎంఈఓ వేముల నాగయ్యల ఆధ్వర్యంలో మొక్కలు నాటతారని, గౌతమ్ స్కూల్ నిర్వాహకురాలు డి సరోజ తెలిపారు. శనివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అతిధులచే నిర్వహించనున్నామన్నారు. వేడుకలను ఘనంగా జరుపుతామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ముగిసిన వార్డు మెంబర్ల నామినేషన్ ప్రక్రియ

బొల్లాపల్లి : మండలంలో రెండు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న రెండు వార్డులకు నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని ఆర్వోలు తెలిపారు. లాలిపురం పంచాయతీలో 2వ వార్డుకు ఉస్తాల దుర్గాభవాని నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో బి.సైదావలి తెలిపారు. సరైన సమయంలో కుల ధ్రువీకరణ పత్రం సమర్పించక పోవడంతో తిరస్కరణకు గురైందని ఆయన చెప్పారు. నెహ్రూనగర్ తండా పంచాయతీలో 1వ వార్డుకు మూడావత్ నానునాయక్ నామినేషన్ పత్రం దాఖలు చేసినట్లు ఆర్వో జి.రామాంజనేయులు తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం నిల్వ కేసులో నిందితుల్ని అరెస్టు చేసి 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శనివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు శ్రీనివాసనగర్‌లో దాడులు నిర్వహించి, అక్రమంగా తెలంగాణ మద్యం కలిగి ఉన్న వెంకటేష్, కృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.